# మీడియా అకాడమీ చైర్మన్‌కు సన్మానం


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన ల్యాంకోహిల్స్ వాసులు

**మణికొండ:** రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్‌రెడ్డిని మణికొండ ల్యాంకోహిల్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న కొత్తగూడెం ఎమ్మెల్యే కె.సాంబశివరావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు, స్థానిక విలేకరుల తమస్యలు పరిష్కరించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. వారికి సొంతిళ్లు లేవని సకాలంలో వైద్యం కూడా చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాంటి వారిని మీడియా అకాడమీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను త్వరలోనే కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, ఐజేయూ కార్యవర్గ సభ్యుడు కె.సత్యనారాయణ, ల్యాంకో హిల్స్ నివాసితుల సంఘం కార్యదర్శి భాస్కర్, నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్ సింగ్, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


నూతన కమిటీతో సీతారాం, భాస్కర్‌రెడ్డి

**మణికొండ:** కాలనీల వారీగా ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మణికొండ మున్సిపాలిటీ ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీతారాం అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని కేఎస్ఆర్ డైమండ్‌హిల్స్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో జీస్కూల్ చైర్మన్ కె. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో ఉన్న సమస్యలను కాలనీ సంక్షేమ సంఘాలు తమ వంతు కృషి చేస్తాయన్నారు. అన్ని కాలనీలలో ఉన్న ప్రధాన సమస్యలతో పాటు సామూహిక సమస్యలను ఆల్ కాలనీస్ ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు. అలాంటి సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అన్వేష్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మిశ్రీ, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా మాణిక్యరెడ్డి, సంయుక్త కోశాధికారిగా హరీష్, సంయుక్త కార్యదర్శిగా వినోద్, మహిళా ప్రతినిధిగా సమతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు కాలనీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు.

## ఆస్తిపన్ను పరిష్కార వేదికకు ఫిర్యాదులు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ఆస్తిపన్ను పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు అందినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. ఐదుగురు ఫిర్యాదుదారులు తమ ఆస్తి పన్ను అధికంగా వస్తుందని రివైజ్ చేయాలని ఫిర్యాదులో పేర్కొనట్లు చెప్పారు. మరో ఇద్దరు తమ పేరు మార్పుకోసం ఫిర్యాదు చేసినట్లు వివరించారన్నారు. ఆస్తిపన్ను పరిష్కార వేదికకు అందిన ప్రతి సమస్యను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సర్కిల్ పరిధిలోని ఇంటి యజమానులు తమ ఆస్తిపన్నును వెంటనే చెల్లించాలని కోరారు. అభివృద్ధికి ఆస్తిపన్ను ఎంతో ముఖ్యమని.. ఆస్తిపన్నును సకాలంలో చెల్లించాలన్నారు. ఫిర్యాదులను సంబంధిత బిల్ కలెక్టర్లకు అందించినట్లు వారు వాటిని పరిశీలించి పూర్తి వివరాలను అందజేస్తారని స్పష్టం చేశారు.

# నీటి వృథాను అరికట్టండి !

నీటి సమస్యను పరిష్కరించాలని నిరసనలు


గండిపేట క్యాండూట్ లీకేజీతో వృథాగా..

**మణికొండ:** నీటిని పొదుపుగా వాడుకోవాలి.. నీటిని ఏమాత్రం వృథా చేయొద్దని జలమండలి శాఖ ప్రకటనలతో ప్రజలకు సూచనలు చేస్తుంది. సదరు శాఖనే రోజూ లక్షల లీటర్ల నీరు వృథాగా పోతున్నా.. పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – గండిపేట చెరువు నుంచి హైదరాబాద్ నగరానికి నీటిని సరఫరా చేసే గండిపేట చెరువు వద్దనే లక్షల లీటర్ల నీరు ప్రతి రోజూ వృథాగా పోతుందని వారు వాపోతున్నారు. హైదరాబాద్ నగర ప్రజల అవసరాల కోసం గండిపేట, హిమాయత్‌సాగర్‌ల నుంచి 15 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. అది కాస్తా.. గండిపేట చెరువు నుంచి షేక్‌పేట ఫిల్టర్ బెడ్ వరకు ఉన్న క్యాండూట్ సామర్థ్యానికి మించి సరఫరాను తీసుకుంటున్నారు. దీంతో గండిపేట గండమ్మ దేవాలయ ప్రవేశంలోనే నీరు పొంగి ప్రవహిస్తుంది.

**లక్షల లీటర్లు వృథా..**

దేవాలయం పక్కన సైతం క్యాండూట్ నుంచి నీరు లీకేజీ ఏర్పడి లక్షల లీటర్ల నీరు వృథాగా పోతుందని స్థానికులు పేర్కొన్నారు. గండిపేట్‌లోనే కాకుండా కోకాపేట్, పుప్పాల్‌గూడ, మణికొండ ప్రాంతాల్లో పలుచోట్ల లీకేజీలు ఏర్పడి నీరు వృథా అవుతోంది. క్యాండూట్‌కు ఏర్పడుతున్న లీకేజీల మరమ్మతులు చేయకపోవటంతోనే ఇలా జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. దీనిపై జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు తగిన చర్యలు చేపట్టి లీకేజీలను అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం

**బండ్లగూడ:** ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్న అధికారులు పన్నులు సకాలంలో చెల్లించాలని కోరడం విడ్డూరంగా ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పద్మశ్రీహిల్స్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు పలుసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఆదివారం కాలనీవాసులు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. స్థానికంగా మిషన్ భగీరథ రిజర్వాయర్ నిర్మాణానికి నోచుకోక తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పీఎన్‌టీ కాలనీ, అత్తాపూర్ మధ్యలో ఉన్న మూసీపై బ్రిడ్జి నిర్మాణ పనులు, పైపులైన్ ఇంటర్ లింక్ పనులు పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

## నో వాటర్.. నో ఓట్..

**మణికొండ:** మున్సిపాలిటీ పరిధిలోని ఖిజ్రా కాలనీ ప్రజలు తాగునీటి కోసం ఫ్లెక్సీలు, వినతి పత్రాలు నిర్వహించిన విషయం తెలిసిందే. అప్పటికీ వారి సమస్య పరిష్కారానికి ఏ ఒక్కరూ ముందుకు రాకపోవటంతో ఆదివారం సాయంత్రం ఏకంగా కాలనీవాసులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ఎండలు ముదిరిపోవటంతో తమ బోర్లు వట్టిపోయాయని, తమ కాలనీ గుట్టపై ఉండటంతో జలమండలి వారు సరఫరా చేస్తున్న నీరు ఏమాత్రం రావడం లేదని వాపోతున్నారు. రంజాన్ మాసం ప్రారంభమవుతుందని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదన్నారు. జలమండలి ట్యాంకర్లను బుక్ చేస్తే సరఫరాకు 3 నుంచి 10 రోజుల వరకు సమయం తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం జరగకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటు వేయమని వారు స్పష్టం చేశారు. స్థానిక కౌన్సిలర్లు బి. పద్మారావు, ఎ.నవీన్‌కుమార్‌లు వారికి మద్దతు తెలిపారు.


నిరసన ర్యాలీలో పాల్గొన్న కాలనీవాసులు



నిరసన తెలుపుతున్న ఖిజ్రాకాలనీ వాసులు

## కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల తదితరులు

**ఏజీవర్సిటీ:** రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ, ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్–2024 కేలండర్‌ను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సిబ్బంది పలు సమస్యలను మంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఎస్టీ, ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలజీనాయక్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యక్షులు పరమేష్, అరుణ్ కుమార్, నర్సింగ్‌రావు, గోవర్ధన్ బీవీ వరప్రసాద్, రమేష్, సత్యనారాయణ, బాలనర్సింహా, లక్ష్మిప్రసన్న, ఈశ్వరి పాల్గొన్నారు.

## చలివేంద్రాలతో ప్రజలకు మేలు


నెక్నాంపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన కౌన్సిలర్లు, ట్రస్ట్ సభ్యులు

**మణికొండ:** వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, సేవామూర్తులు ఏర్పాటు చేసే చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మణికొండ మున్సిపల్ కౌన్సిలర్లు పద్మారావు, నవీన్‌కుమార్‌లు అన్నారు. ఆదివారం దాతల సహకారంతో వీఆర్‌ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ఐదు చోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవికాలం రాకముందే ఎండలు మండిపోతున్నాయన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. గీతూస్ ప్రాజెక్ట్స్ ఎండీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ లక్ష్మణ్‌రావు, ట్రస్ట్ సభ్యులు నిర్మల్ చంద్, దిలీప్ కక్కడ్, తజ్రీబ్ హుస్సేన్, మోహన్‌కుమార్, నరోత్తం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏజీ వర్సిటీలో సాంస్కృతిక, సాహిత్య పోటీలు

**ఏజీవర్సిటీ:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఈనెల 11 నుంచి నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం డీన్ జెల్లా సత్యనారాయణ, అసోసియేట్ డీన్ నరేంద్రరెడ్డి తెలిపారు. మూడ్రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలకు 11 వ్యవసాయ కళాశాలల నుంచి 205 విద్యార్థినీవిద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు. విద్యార్థుల్లో ఉండే ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## అన్నదానం

**మణికొండ:** ఆకలితో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రతి అమావాస్య రోజు తమ సంస్థ తరఫున అన్నదానం నిర్వహిస్తున్నామని మణికొండ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. ఆదివారం వారి కార్యాలయం వద్ద పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉమ్రా యాత్రికులకు ఘనస్వాగతం



**శంషాబాద్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఇటీవల ఉమ్రా యాత్రను పూర్తి చేసుకున్న 100 మంది యాత్రికుల బృందం ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు వారికి ఆత్మీయ స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలలతో సత్కరించారు. పవిత్ర ఉమ్రా యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసినట్లు నిర్వాహకులు ఫయాజ్ అలీ పేర్కొన్నారు.

## కొనసాగుతున్న మంచిరేవుల బ్రహ్మోత్సవాలు


దేవాలయం వద్ద పల్లకీ సేవలో పాల్గొన్న గ్రామస్తులు

**మణికొండ:** నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని మచిలేశ్వరస్వామి, వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గత మూడ్రోజులుగా కొనసాగిన బ్రహ్మోత్సవాలు ఆదివారం తెల్లవారు జామున భృంగీశ్వరసేవ, అగ్నిగుండాల అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం తెల్లవారు జామున నందీశ్వర సేవ, రథోత్సవం, మధ్యాహ్నం దేవాలయం వద్ద అన్నదానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ధర్మకర్తలు ప్రకటించారు. చివరిరోజు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 'నిథమ్' ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌కు గ్రాండ్ క్వీన్ అవార్డు


అవార్డును స్వీకరిస్తున్న మిషెల్లీఫ్రాన్సిస్

**రాయదుర్గం:** 'నిథమ్'లో కెరియర్ కౌన్సిలర్, మెంటర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిషెల్లీఫ్రాన్సిస్‌కు గ్రాండ్ క్వీన్ అవార్డు–2024 అందించి గౌరవించారు. లయన్స్‌క్లబ్, గ్రాండ్ క్వీన్స్‌క్లబ్ సంయుక్తంగా ఈ గ్రాండ్ క్వీన్ అవార్డును అందించారు. వివిధ రంగాలలో విశేషమైన కృషి చేస్తున్న వారిని గుర్తించి వారి సేవలకు ప్రతిఫలంగా గ్రాండ్ క్వీన్ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. 2024లో మిషెల్లీఫ్రాన్సిస్‌ను అవార్డు కోసం ఎంపిక చేశారు. పర్యాటక ఆతిథ్య కేంద్రమైన 'నిథమ్'లో ఆమె అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం నగరంలో లయన్స్‌క్లబ్, గ్రాండ్‌క్వీన్స్‌క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అవార్డును స్వీకరించారు.

## నేడు బీజేపీ ఓబీసీ సమ్మేళనం

**మణికొండ:** బీజేపీ ఓబీసీ సామాజిక సమ్మేళనం సోమవారం నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట్ కమ్యూనిటీహాల్‌లో సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కులసంఘాల నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## బెంగుళూరు విమానం రద్దు

ఇబ్బంది పడిన ప్రయాణికులు

**శంషాబాద్:** హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లాల్సిన విమానం రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ నుంచి ఉదయం 10.50 గంటలకు వెళ్లాల్సిన విమానం సాంకేతిక సమస్యల కారణంగా రద్దయింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సదరు ఎయిర్‌లైన్స్ అధికారులు సాయంత్రం వరకు కూడా ఖచ్చితమైన సమాచారం లేకపోవడంతో ఆందోళనకు దిగారు. రాత్రి వరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని ప్రయాణికులు వాపోయారు.

# బీజేపీ ప్రచార రథాలకు పూజలు


ఆరమైసమ్మ దేవాలయం వద్ద ప్రచార రథాలను ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

**బండ్లగూడ:** వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాషాయ జెండాను ఎగురవేస్తామని చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు అంజన్ కుమార్‌గౌడ్ అన్నారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరమైసమ్మ దేవాలయం వద్ద చేవెళ్ల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రచార రథాలకు బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. నియోజకవర్గంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో బీజేపీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సుభిక్షంగా ఉన్నారని, మరోసారి దేశ ప్రధానిగా నరేంద్రమోదీనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో 17 స్థానాల్లో బీజేపీ విజయ కేతనం ఎగరవేయనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. వై.శ్రీధర్, నందకిశోర్, బీజేఎంసీ బీజేపీ అధ్యక్షులు కొండె మహేష్ యాదవ్, పీ.ఎస్.మల్లారెడ్డి, నగేష్‌యాదవ్, భీమార్జున్, నరేష్‌యాదవ్, గోపాలకృష్ణగౌడ్, భువనేశ్వరి, గౌతమీ, అపర్ణ తదితరులున్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**రాజేంద్రనగర్:** సావిత్రిబాయి పూలే జయంత్యువాలను ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని సావిత్రిబాయి సేవలను కొనియాడారు. సత్యనారాయణ ముదిరాజ్, యాదయ్య, నారాయణ స్వామి కె.ఎస్.దయానంద్, కోరని బాల్‌రాజ్, శ్రీను, డాక్టర్ శ్రీరాములు, పోతరాజు యాదయ్య, ప్రీతం సుబ్బారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మత పెద్దలతో పోలీసుల సమావేశం


రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ, ఏసీపీలకు ఖురాన్‌ను అందజేస్తున్న దృశ్యం

పోలీసులకు సహకరిస్తామని వెల్లడి


మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

**అత్తాపూర్:** ముస్లింలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహించుకునే సాంప్రదాయ వేడుకల్లో ప్రధానమైన పండుగ రంజాన్ నిలుస్తుందని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఎంఎం పహాడి పింక్ రోజ్ ఫంక్షన్‌హాల్‌లో ముస్లిం మతపెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకునే రంజాన్ పండుగ ప్రత్యేకత చాటుకుందన్నారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేస్తూ.. మానవాళి మనుగడ కోసం ప్రార్థనలు చేయడం జరుగుతుందని వివరించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముస్లిం మతపెద్దలు ఒకరికొకరు సహకరించుకుంటూ.. నెలరోజుల పాటు సాగే రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. హిందువులు, ముస్లింలు అనే తారతమ్యం లేకుండా గత కొన్నేళ్లుగా జీవిస్తున్నామని మత పెద్దలు పేర్కొన్నారు. పోలీసులకు సహకరిస్తామని మత పెద్దలు ఈ సందర్భంగా వివరించారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి, ఎస్సై శ్రీను, నాగరాజు, శ్రీనివాస్, నిమ్మల వెంకన్న, ఏఎస్సై మహ్మద్ అర్షద్ అలీ తదితరులున్నారు.

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ ఐబీ ప్యాలెస్‌లో ఆదివారం ముస్లిం మత పెద్దలు, వివిధ కాలనీలకు చెందిన ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని, ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏసీపీ శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ముస్లిం నాయకులు షాహీద్ పీర్, సుజాద్‌ఖాన్‌లు డీసీపీతో పాటు ఏసీపీలకు ఇంగ్లిష్‌లో ప్రచురించిన పవిత్ర ఖురాన్‌ను అందజేశారు.